సాక్షి
కాకినాడ

శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



శ్రీవారి ఆలయానికి విరాళం


దేవరపల్లి: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన పిన్నమని రామకృష్ణ దంపతులు రూ.2.01,111 విరాళాన్ని చైర్మన్ శ్రీనివాసరావు ద్వారా అందజేశారు.



తాండ్ర తయారీలో ట్రెండూల్కర్లు

సహజ సిద్ధంగా ఎలాంటి రసాయనాలు కలపకుండా తయారు చేసే మామిడి తాండ్రకు కేరాఫ్ అడ్రస్‌గా ఆత్రేయపురం పేరు గడించింది. తాండ్ర తయారీలో ఇక్కడ కొత్త పోకడలు పోతున్నారు. - 8లో ▶

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 3,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు 50, పశ్చిమ డెల్టాకు 2,500క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

భూ సర్వే పూర్తయితే హక్కు పత్రాల పంపిణీ

కాకినాడ సిటీ: సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు భూ హక్కు పత్రాలను అందజేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకానికి సంబంధించి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్, అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ జి సాయిప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో కలిసి ఆమె హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేకు సంబంధించి జిల్లాలో రీ సర్వే ఊర్తయిన గ్రామాల్లో ఇంకా మిగిలిన రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో అధికారులు సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అనుగుణంగా సర్వే పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

కాకినాడ సిటీ: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్తల పోస్టుల భర్తీకి అంగన్‌వాడీ, హెల్పర్ల సెలక్షన్ కమిటీ ఆమోదం తెలిపింది. జిల్లా మహిళా, శిశుసంక్షేమ, సాధికారితా అధికారి కె ప్రవీణ ఈమేరకు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత సీడీపీవో కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మే 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

సత్యదేవుని దర్శించిన జిల్లా జడ్జి గందం సునీత



సత్యదేవుని సన్నిధిలో జిల్లా జడ్జి సునీతకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అన్నవరం: తూర్పుగోదావరి జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి గందం సునీత గురువారం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద ఆమెకు పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాలను ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు అందచేశారు. ఆమె వెంట పలువురు న్యాయాధికారులున్నారు.

నేడు ప్రత్యేక స్పందన

కాకినాడ సిటీ: ఎస్సీ, ఎస్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రత్యేక స్పందన నిర్వహించనున్నట్టు కలెక్టర్ కృతికా శుక్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు స్పందన కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేయబడిన ప్రత్యేక స్పందన సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించండి

కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో చిన్నారులు, గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించడం ద్వారా రక్త హీనతను అధిగమించవచ్చని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి గురువారం సాయంత్రం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జేసీఎస్ ఇలక్కియతో కలిసి హాజరై, అనంతరం అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య అంశమైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు వివిధ విభాగాల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని పని చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై సీఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్‌తో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, సీపీవో పి.త్రినాథ్, డీఈవో కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆర్ రమేష్, డీసీహెచ్‌ఎస్ పీబీ విష్ణువర్ధిని, ఆరోగ్యశ్రీ సమన్వయకర్త డాక్టర్ పి.రాధాకృష్ణ, ఐసీడీఎస్ పీడీ కె.శ్రీరమణ, వికాస పీడీ కె లచ్చారావు, సోషల్ వెల్ఫేర్ జేడీ రంగలక్ష్మీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, కాకినాడ, పెద్దాపురం డీఎల్‌డీవోలు నారాయణమూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో వెరీగుడ్డు

- సరఫరా చేసే కోడిగుడ్లపై అధికారులు నిఘా
- సక్రమంగా చేరవేసేలా ప్రణాళికాయుత చర్యలు
- నెలకు మూడు రంగుల్లో పంపిణీ ప్రక్రియ
- పౌష్టికాహారంలో గుడ్డుదే కీలకపాత్ర



అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్లు

కాకినాడ సిటీ: పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల్లో కోడిగుడ్డుకు ప్రత్యేక స్థానం ఉంది. కంటి చూపునకు మేలు చేయడంతో పాటు రక్తహీనత నివారించడం, ఎముకల్లో బలం చేకూర్చడం, మనిషికి కావాల్సిన విటమిన్లు అందించేందుకు ఇది ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. ఈ ప్రాముఖ్యతను గుర్తించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్లను ఉచితంగా అందిస్తోంది. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు ఉడికించి అందజేస్తోంది. అయితే కొన్ని ప్రాంతాల్లో సరఫరా సరిగా లేక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో గుడ్ల సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని అధికారులను ఆదేశించింది. అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్ల సరఫరాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. లబ్ధిదారులకు సక్రమంగా అందజేసేలా చర్యలు తీసుకుంది.

రోజూ 1.15 లక్షల మందికి సరఫరా ...

జిల్లాలో పది ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో 1986 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 1,15,780 మంది ప్రయోజనం పొందుతున్నారు. ఇందులో 6 నెలల నుంచి మూడేళ్ల మధ్య చిన్నారులు 60,751 మంది ఉన్నారు. మూడు నుంచి 6 ఏళ్ల మధ్య పిల్లలు 30,523 మంది ఉన్నారు. 12,526 మంది గర్భవతులు, 11,980 మంది బాలింతలు ఉన్నారు. వీరికి ప్రతి రోజూ (సెలవు రోజు మినహాయించి) ఒకటి చొప్పున ప్రభుత్వం గుడ్లు సరఫరా చేస్తోంది. నెలలో ఒక్కొక్కరికి 25 గుడ్లు అందజేస్తున్నారు.

మూడు రంగుల్లో సరఫరా...

కోడి గుడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంచితే పాడవుతాయి. ఒకసారి వచ్చిన గుడ్లను నెల పొడవునా సరఫరా చేయడం, అవి కుళ్లిపోతున్న విషయాలను ప్రభుత్వం గ్రహించింది. దీనికి చెక్ పెట్టేందుకు రంగుల విధానాన్ని అవలంబిస్తోంది. నెలలో పది రోజులకు ఒక రంగు చిహ్నంతో మూడు రంగుల్లో సరఫరా చేయాలని నిర్ణయించింది. 1-10 తేదీల మధ్య బ్లూ, 11-20 తేదీల మధ్య పింక్, 21 నుంచి నెలాఖరు వరకు గ్రీన్ రంగు ఉన్న గుడ్లు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారమే జిల్లాలోని ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లను సరఫరా చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో గుడ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. సూపర్‌వైజర్లతో ప్రత్యేక తనిఖీలు చేయిస్తున్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన గుడ్లను అందించేలా చూస్తున్నారు.

నెలకు 26.15 లక్షల గుడ్లు సరఫరా...

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు పొందే వారికి నెలకు 26.15 లక్షల గుడ్లు సరఫరా అవుతున్నాయి. నాణ్యమైన గుడ్లను సరఫరా చేసే కాంట్రాక్టు సంస్థను గుర్తించి గుడ్డు రూ. 4.26 పైసల వంతున అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తోంది. బిక్కవోలు మండలం బలభద్రపురం నుంచి గుడ్లను ప్రతి 10 రోజులకు ఒకసారి అంగన్‌వాడీ కేంద్రాలకు నేరుగా సరఫరా చేస్తున్నారు. దీంతో ఏ అంగన్‌వాడీ కేంద్రంలో కూడా గుడ్లు నిల్వ ఉండటం లేదు. వచ్చిన వెంటనే వాటిని లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

తనిఖీలు చేయాలని ఆదేశాలు

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యత గల గుడ్లు అందించాలని ఆదేశించాం. సరిగా ఉన్నాయా లేదా అనేది వచ్చిన వెంటనే పరిశీలించి రిపోర్టు తీసుకుంటున్నాం. వైఎస్సార్ పోషణ కిట్లు నాణ్యతతో ఇచ్చేలా చర్యలు చేపట్టాం. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన గుడ్లను వచ్చిన వెంటనే తనిఖీలు చేయాలని సీడీపీవోలు, సూపర్‌వైజర్లను ఆదేశించాం. పౌష్టికాహార లోపంతో ఏ ఒక్కరూ ఉండకూడదని పకడ్బందీగా ఉంటున్నాం.

– కొండా ప్రవీణ, స్త్రీ,శిశుసంక్షేమశాఖ అధికారి

ప్రైవేట్ దందాకు చెక్

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దర్జాగా వసూళ్లు
- రోజుకు రూ.లక్షల్లో అనధికారిక ఆదాయం
- ఏసీబీ దాడుల్లో వెలుగు చూసిన వైనం
- అక్రమార్కుల గుండెల్లో మొదలైన గుబులు



తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తుని: సంక్షేమంతో పాటు సేవలను పారదర్శకంగా ప్రజలకు అందించాలని ప్రభుత్వం తపన పడుతోంది. కానీ కొందరు అధికారులు దీనికి గండి కొడుతున్నారు. తమ మామూళ్ల కోసం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి బాగోతమే ఇందుకు తార్కాణం. తాజాగా బుధవారం ఏసీబీ రాష్ట్ర వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించిన నేపథ్యంలో ఇక్కడి అనధికార వసూళ్ల వ్యవహారం బహిర్గతమైంది. ఈ దాడులు అధికారుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి.

ఇదీ పరిస్థితి

రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా స్థిరాస్తుల కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రభుత్వం ఆన్‌లైన్ సదుపాయం కల్పించింది. అయినా కొన్నిచోట్ల ఇందుకు భిన్నంగా కార్యకలాపాలు సాగిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తిష్ట వేసిన కొందరు ప్రయివేటు వ్యక్తులు దందాలు నడుపుతున్నారు. ఇందుకు జిల్లా స్థాయి అధికారులతో పాటు మరి కొందరు ప్రముఖులు లోపాయికారీగా సహకరిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గణనీయ చరిత్ర ఉంది. క్రమేపీ రిజిస్ట్రేషన్ల సంఖ్యతో పాటు ఆదాయ వనరులు పెరిగాయి. ఇదే అదనుగా కొందరు ప్రయివేటు వ్యక్తులు కార్యాలయంలో చేరారు. వీరికి ప్రభుత్వ పరంగా ఏ విధమైన జీతాలు చెల్లించరు. కాకపోతే వీరే రిజిస్ట్రేషన్ కార్యకలాపాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. ప్రతి రిజిస్ట్రేషన్‌కు ఇంతమొత్తం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎవరైనా వ్యతిరేకిస్తే సాంకేతిక కారణాలు చూపుతూ అడ్డంకి వేస్తున్నారు. ఇందుకు కొందరు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలంలో ఆక్రమ దందా ఏసీబీ అధికారుల తాజా దాడులతో వెలుగులోకి వచ్చింది.

రోజుకు 50 రిజిస్ట్రేషన్లు

తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి ఎక్కువ. దీంతో రోజుకు 50 వరకు ఆస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రూ.50 కోట్ల మేర లావాదేవీలు జరుగుతున్నాయి. స్టాంప్ డ్యూటీతో పాటు రిజిస్టేషన్ ఫీజు నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో చెల్లించాలి. కానీ రిజిస్ట్రేషన్ విలువలో ఒక శాతం సొమ్మును ముడుపులుగా అధికారులు తీసుకుంటున్నారని తెలిసింది. ఇందుకు దస్తావేజు లేఖర్లు, ప్రయివేటు వ్యక్తులను వినియోగించుకుంటున్నారు. ఈలెక్కన రూ.50 కోట్లకు ఎంత మేర వసూలు చేస్తున్నారో అర్థం అవుతుంది. ఈ వసూళ్ల దందా చాలా కాలం నుంచి జరుగుతోంది. తాజాగా ఏసీబీ అధికారుల సోదాల్లో విస్తుబోయే నిజాలు బయటపడ్డాయి. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం ఆరు గంటల వరకు వీరు తనిఖీలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అనధికార వ్యక్తుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ప్రాథమికంగా దొరికిన సొమ్ము స్వల్పమైనా కీలక డాక్యుమెంట్లు లభ్యం కావడంతో ఏ క్షణమైనా కొందరిని అరెస్ట్ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

అవినీతి పరుల అరెస్టు తప్పదు



తుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించాం. పలు కీలక అంశాలు, రికార్డులను స్వాధీనం చేసుకున్నాం. ప్రభుత్వ కార్యాలయంలో అంతమంది ప్రయివేటు వ్యక్తులను ఎందుకు అనుమతించారని సబ్ రిజిస్ట్రార్‌ని ప్రశ్నించాం. సమాధానం రాలేదు. పర్మినెంట్ సిబ్బంది కన్నా ప్రయివేటు వ్యక్తులు ఎక్కువ మంది ఉన్నారు. జిల్లా రిజిస్ట్రార్‌ను పిలిపించి వివరాలు అడిగాం. ఆమె విచారణ జరిపి నివేదిక అందిస్తారు. విచారణ జరిపాక నిందితులను అరెస్ట్ చేస్తాం.

– సౌజన్య, ఏఎస్పీ, ఏసీబీ, రాజమహేంద్రవరం.

ఆదర్శవంతంగా గోశాల నిర్వహణ



గోశాలలో దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ గీత తదితరులు

దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

కాకినాడ రూరల్: ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తిమ్మాపురంలో శ్రీమతి ఆకొండి లక్ష్మి గోశాలలో కొత్తగా అభివృద్ధి చేసిన స్థలంలో భవనాలను రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. గోశాలను ఆనుకుని తిమ్మాపురం వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన సుమారు ఐదు ఎకరాల స్థలం ఉంది. దీనిని రాష్ట ప్రభుత్వం లీజు ప్రతిపాదికన గోవుల గ్రాసం, యాగశాల తదితర అవసరాలకు కేటాయించింది. ఈ స్థలంలో గ్రాసంతో పాటు పార్కింగ్, యాగశాల షెడ్ తదితర వాటిని నిర్మించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ వాటిని ప్రారంభించారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జిల్లా కలెక్టరు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా దంపతులు, మాజీ మంత్రి పేర్ని నాని దంపతులు, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రానికి తలమానికంగా చాగంటి గోశాల నిర్మించి ఆదర్శవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. చాగంటి మాట్లాడుతూ తిమ్మాపురంలో తమ గోశాలోని గోవులు తిరిగేందుకు, గ్రాసం పెంచేందుకు, సందర్శకుల వాహనాల పార్కింగ్ కోసం స్థలం కొరత ఉండడంతో ఎదురుగా ఉన్న ఐదు ఎకరాలు లీజుకు అడిగితే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, దేవదాయ శాఖ, ముఖ్యమంత్రి దరఖాస్తు చేసుకున్న 30వ రోజున ఉత్తర్వులను పంపారని కృతజ్ఞతలు తెలిపారు.

నేతల ప్రలోభాలకు దూరంగా ఉండండి



రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ

సాక్షిప్రతినిధి, కాకినాడ: ప్రభుత్వంపై బురద జల్లేందుకు సచివాలయ ఉద్యోగులను సంఘాల పేరుతో కొందరు నాయకులు ప్రలోభాలకు గురి చేస్తున్నారని గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విప్పర్తి నిఖిల్ కృష్ణ ఆరోపించారు. ఈ విషయంలో సచివాలయ ఉద్యోగులు అప్రమత్తతతో వ్యవహరించాలని కోరారు. గురువారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సమన్వయకర్త దారపురెడ్డి తాతాజీ రావుతో సంయుక్తంగా కాకినాడలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 29న ఇచ్చిన ఆందోళన పిలుపునకు సచివాలయ ఉద్యోగులు దూరంగా ఉండాలన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర, దేశ చరిత్రలో ఎప్పుడు జరగని విధంగా ఎంతో పారదర్శకంగా అత్యధిక ఉద్యోగాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. సచివాలయ ఉద్యోగులకు సౌకర్యాలు, లబ్ధి చేకూర్చదనే వాదన సరికాదన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి సత్వరమే పరిష్కారించేలా అన్ని స్థాయిల్లో కృషి చేశామన్నారు. ఇంతవరకు సచివాలయ ఉద్యోగుల సంక్షేమం కోసం పట్టించుకోని కొందరు నేతలు స్వలాభం కోసం వ్యవహరిస్తున్నారన్నారు. సచివాలయ ఉద్యోగులను తమ బలంగా చూపించుకునేందుకు చేస్తోన్న ప్రయత్నాలను ఎక్కడికక్కడ తిప్పికొట్టాలన్నారు. అసత్య ప్రచారంతో రెచ్చగొట్టి, ధర్నాలకు రావాలంటూ పిలుపునిస్తున్న వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇలాంటి స్వార్థపర శక్తులకు దూరంగా ఉండాలని సచివాలయ ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

భగీరథుని సంకల్ప బలం స్ఫూర్తిదాయకం




భగీరథుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎంపీ గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు

కాకినాడ: మహర్షి భగీరథుని సంకల్పబలం, పట్టుదల ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. భగీరథుని జయంతి కార్యక్రమాన్ని గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గొడారిగుంట సగరుల రామాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత భగీరథ మహర్షి విగ్రహానికి ఎంపీ వంగా గీత, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా, కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ పవిత్ర గంగను దివి నుంచి భువికి తీసుకొచ్చిన మహర్షి భగీరథుని దీక్షా, దక్షిత ఎనలేనిదన్నారు. సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు మాట్లాడుతూ భగీరథుని స్మరించుకుని ఆయన సేవలను జ్ఞప్తికి తెచ్చుకునే అవకాశం కలగడం సంతోషంగా ఉందన్నారు.

కాడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, బీసీ సంక్షేమ అధికారి పి.సత్యరమేష్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ కంపర బాబి, సగర సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీటొస్తే నవోదయమే..



- రేపు జరిగే పరీక్షకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు
- 35 కేంద్రాల్లో హాజరు కానున్న 8,779 మంది

రాయవరం: ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, క్రీడలు, సాహస కృత్యాలు, పౌష్టికాహారంతో పాటు వివిధ రంగాల్లో అధునాతన శిక్షణకు జవహర్ నవోదయ విద్యాలయాలు వేదికగా నిలుస్తున్నాయి. వీటిలో ప్రవేశాల కోసం ఏటా వేలాది మంది విద్యార్థులు పోటీ పడతారు. ఒకసారి 6వ తరగతిలో ప్రవేశం పొందితే +2(ఇంటర్) వరకు విలువలతో కూడిన ఉచిత విద్య లభిస్తుంది. నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి శనివారం జిల్లా వ్యాప్తంగా పరీక్ష నిర్వహించనున్నారు.

పరీక్షా కేంద్రాలు, హాజరయ్యే విద్యార్థులు

జిల్లా	పరీక్షా కేంద్రాలు	దరఖాస్తు చేసిన విద్యార్థులు
కోనసీమ	15	3,714
తూర్పుగోదావరి	07	1,842
కాకినాడ	14	3,223



ఐదవ తరగతి విద్యార్థులు


8,779 మంది విద్యార్థులు:

ఉమ్మడి జిల్లా పరిధిలో పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. 80 సీట్లకు 8,779 మంది పోటీ పడుతున్నారు. కాకినాడ జిల్లాలో 14, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 15, తూర్పుగోదావరి జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరోనా నేపథ్యంలో 2021లో 5,371 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోగా, గతేడాది 10,741 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది 8,779 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల అనంతరం విద్యార్థుల ఓఎంఆర్ షీట్లను మూల్యాంకనం నిమిత్తం ఢిల్లీకి పంపిస్తారు. అక్కడే విద్యార్థుల ఎంపిక జరుగుతుంది.

80 ప్రశ్నలు..100 మార్కులు

ప్రశ్నపత్రంలో 80 ప్రశ్నలకు వంద మార్కులు కేటాయించారు. మెంటల్ ఎబిలిటీలో 40 ప్రశ్నలకు 50 మార్కులు, గణితంలో 20 ప్రశ్నలకు 25 మార్కులు, భాష పరిజ్ఞానంలో 20 ప్రశ్నలకు 25 మార్కులు కేటాయించారు. విద్యార్థులు ఉదయం 10.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఉదయం 11 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి



నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులతో మాట్లాడాం. సీఎస్, డీవో, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయింది. సెంటర్ లెవల్ అబ్జర్వర్లను నియమించి శిక్షణ ఇస్తున్నాం.

– కె.రామిరెడ్డి, ప్రిన్సిపాల్ జవహర్ నవోదయ విద్యాలయ సమితి, పెద్దాపురం.

విద్యార్థులకు సూచనలివీ..

- విద్యార్థులు రెండు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది.
- హాల్ టికెట్‌పై సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం ఉండాలి.
- ఆ హాల్ టికెట్‌ను ఇన్విజిలేటరుకు అందించాలి.
- బ్లూ లేదా బ్లాక్ పెన్నుతోనే పరీక్ష రాయాలి.
- విద్యార్థులు పాఠశాల యూనిఫామ్, లేదా సివిల్ డ్రెస్‌లో హాజరు కావచ్చు.
- ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకురాకూడదు.
- మాస్కు, శానిటైజర్ తప్పనిసరిగా తీసుకురావాలి.

క్లుప్తంగా

రూ.2 లక్షలు పోయిందని ఫిర్యాదు

అమలాపురం టౌన్: స్థానిక బులియన్ మార్కెట్‌కు బంగారం కొనేందుకు బుధవారం రూ.2 లక్షల నగదు ఉన్న ప్లాస్టిక్ కవర్‌తో మోటారు సైకిల్‌పై వచ్చిన అంబాజీపేట మండలం ఇసుకపూడికి చెందిన పళ్ల శ్రీనివాసరావు ఆ కవర్‌ను పోగొట్టుకున్నారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి రోడ్డుపై పడి ఉన్న ఆ నగదు కవర్‌ను తీసుకుని వెళ్లిపోయినట్లు సీసీ ఫుటేజ్‌ల ద్వారా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.హరీష్‌కుమార్ తెలిపారు.

తాండ్ర తయారీలో ట్రెండూల్కర్లు

- మామిడి తాండ్రకు కేరాఫ్‌గా ఆత్రేయపురం
- సుగరు వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా కారం తాండ్ర
- తయారీలో వైవిధ్యం, పెరుగుతున్న ఎగుమతులు

ఆత్రేయపురం: సహజ సిద్ధంగా ఎలాంటి రసాయనాలు కలపకుండా తయారు చేసే మామిడి తాండ్రకు కేరాఫ్ అడ్రస్‌గా ఆత్రేయపురం పేరు గడించింది. తాండ్ర తయారీలో ఇక్కడ కొత్త పోకడలు పోతున్నారు. సుగరు వ్యాధిగ్రస్తులు కూడా నిరభ్యంతరంగా తినేలా తయారు చేసి సరికొత్త ట్రెండ్ సృష్టించారు. నాణ్యమైన తయారీతో కోట్లాది రూపాయల టర్నోవర్‌ను సాధిస్తూ ఇక్కడి వ్యాపారస్తులు అంతర్జాతీయంగా పేరు గడిస్తున్నారు. వేసవి వచ్చిందంటే రాష్ట్రం నలుమూలల నుంచి కలెక్టర్ రకం మామిడికాయలు లారీల్లో ఆత్రేయపురానికి వస్తాయి. రుచికరమైన మామిడి తాండ్ర తయారీ కోసం వీటిని పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తారు. కార్పొరేట్ కంపెనీలు తయారు చేసే మామిడి తాండ్రకు రకరకాల పేర్లు పెట్టి మార్కెట్‌లోకి వదులుతారు. కానీ అవేవీ ఆత్రేయపురం మామిడి తాండ్రకు సాటి రావని ఇక్కడ జరిగే వ్యాపారమే రుజువు చేస్తోంది. ఆత్రేయపురంలో తయారైన మామిడి తాండ్ర రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతోంది. దీంతో ఈ గ్రామానికి అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు లభిస్తున్నాయి.

ఈ మూడు నెలలే ప్రధానం

కోనసీమ జిల్లాలోని మండల కేంద్రమైన ఆత్రేయపురంలో ఏటా వేసవిలో సుమారు 500 కుటుంబాల వారు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మామిడి తాండ్ర తయారీలో నిమగ్నమవుతారు. ఈ మూడు నెలల కాలంలో పలువురికి జీవనోపాధి లభించడంతో పాటు తయారీదారులు ఈ మూడు నెలల కాలంలో తయారుచేసిన తాండ్రను నిల్వ వుంచి ఏడాది పొడవునా అమ్మకాలు జరుపుతుంటారు. ఈ సీజన్‌లో ఆత్రేయపురం కేంద్రంగా సుమారు రూ.66 లక్షలు విలువచేసే 60 టన్నుల మామిడి తాండ్ర తయారవుతుంది. మామిడి తాండ్ర తయారీకి అవసరమైన కలెక్టరు రకం మామిడి కాయలను నూజివీడు, సత్తుపల్లి, కోరుకొండ, గోకవరం, తుని, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి లారీల్లో దిగుమతి చేసుకుంటారు. ప్రతిరోజు ఆత్రేయపురం గ్రామానికి రెండు లారీల వంతున మామిడి కాయలు దిగుమతి అవుతుంటాయి.

తయారీ ఇలా..

మామిడి కాయలను కావు వేసి మామిడి పండ్లుగా తయారు చేస్తారు. పండ్ల నుంచి గుజ్జు తీస్తారు. గతంలో చేతితో గుజ్జును తీసేవారు. ఇప్పుడు యాంత్రాలను వినియోగిస్తున్నారు. వాటితోనే ఎన్ని టన్నుల మామిడి పండ్ల నుంచి అయినా సులభంగా గుజ్జును తీయవచ్చు.

ఆ గుజ్జులో తగు పాళ్లలో పంచదార, బెల్లం కలిపి ఎండలో వుంచిన తాటి చాపలపై కూలీల సాయంతో ఒక్కొక్క పొరను పూస్తుంటారు. ఇలా ప్రతిరోజూ ఒక్కొక్క పొర వంతన ఐదారు సార్లు పూసిన తరువాత మామిడి తాండ్ర తయారవుతుంది. తయారయిన మామిడి తాండ్ర నిల్వ ఉండేందుకు తాండ్ర పూసిన తాటి చాపలను వారం రోజులపాటు ఎండలో ఆరబెడతారు. అనంతరం మామిడి తాండ్రను ఆరు అంగుళాల పొడవు, వెడల్పు వుండేలా ముక్కలుగా కోసి మళ్లీ ఎండబెట్టి అమ్మకానికి సిద్ధం చేస్తారు.


తాటి చాపలపై మామిడి గుజ్జును పూస్తున్న కార్మికులు


మామిడి గుజ్జు తీసే యంత్రం

వ్యాపారం పెరిగింది



ప్రస్తుతం వున్న మామిడి ధరలతో తాండ్ర తయారీ కొంచెం భారంగా ఉంది. అయితే ప్రజలు ఎక్కువగా ఆత్రేయపురం మామిడి తాండ్ర వైపు మొగ్గు చూపడం వల్ల వ్యాపారం పెరిగింది. టన్ను మామిడి కాయల ధర రూ.17వేలు, పంచదార క్వింటాల్ రూ.4,000 పలుకుతోంది. టన్ను మామిడి కాయలతో 250 కేజీల మామిడి తాండ్ర తయారవుతుండగా కేజీ మామిడి తాండ్ర బెల్లం రకం రూ.200, పంచదార రకం రూ.180కి విక్రయిస్తున్నాం.

– కతారి సురేష్, తాండ్ర వ్యాపారి

సుగరు వ్యాధిగ్రస్తులకు..

మామిడి తాండ్ర తయారీలో పంచదార, బెల్లం విరివిగా ఉపయోగిస్తారు. అందులో పంచదారతో చేసిన తాండ్ర సుగరు వ్యాధిగ్రస్తులకు ప్రమాదం. బెల్లంతో తయారు చేసినవి కొంతమేర తినవచ్చు. ఇవి రెండే కాకుండా ఆత్రేయపురంలో మరో ప్రత్యేకత ఉంది. కారం తాండ్ర. తీపి ఉన్నా లేనట్టుగా ఉంటుంది. ఈ రకం తాండ్ర తయారీలో పంచదార, బెల్లం ఉపయోగించరు. కేవలం మామిడి కాయల నుంచి తీసిన రసంలో నేరుగా కారం కలుపుతారు. సహజంగానే మామిడి రసంలో తీపి ఉంటుంది. దానికి కారం ఘాటు తగిలితే తీపి శాతం తగ్గుతుంది. దీంతో హ్యాపీగా సుగరు వ్యాధిగ్రస్తులు కారంతో తయారు చేసిన మామిడి తాండ్రను తినవచ్చు. అయితే ఈ రకం మామిడి తాండ్రను ఆర్డర్లపై తయారు చేస్తారు.


బెల్లం తాండ్ర

నంది వాహనంపై వీరేశ్వరుడు

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నాలుగో రోజు వైభవంగా సాగాయి. రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో గురువారం ఆలయంలో ఉదయం గవ్యాంతము, చండీహోమం, కళా హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి నందివాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం సదస్యం, సభాపూజ, పండిత సత్కారం నిర్వహించారు. పండిత సదస్యానికి జిల్లాలో పలు ఆలయాల్లో పనిచేస్తున్న వేద పండితులు హాజరవడంతో వేద ఘోషతో మురమళ్ల క్షేత్రం మార్మోగింది. ఈ ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు.


నంది వాహనంపై భద్రకాళీ సమేత వీరేశ్వరుడు

నేటి కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం ఉదయం గణపతి పూజ, గవ్యాంతము, కళాన్యాసములు, పూర్ణాహుతి, వసంతోత్సవం, వృద్ధ గౌతమీ తీరంలో త్రిశూలస్నానం, రథంపై గ్రామోత్సవం, రాత్రి పుష్పోత్సవం, పవళింపు జరుగనున్నాయి.

సీఎంతో భేటీ


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు జీను మహేష్‌బాబు
- కాకినాడ

ఇంటర్ తప్పిన విద్యార్థి ఆత్మహత్య

కాకినాడ సూర్యారావుపేట బీచ్‌లో మృతదేహం లభ్యం


విద్యార్థి వెంకట సుబ్రహ్మణ్యం (ఫైల్)

కాకినాడ రూరల్: ఇంటర్‌లో నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అవ్వడాన్ని జీర్ణించుకోలేని కాకినాడ జగన్నాథపురానికి చెందిన పోతాబత్తుల వెంకట సుబ్రహ్మణ్యం(16) సముద్రంలోకి దిగి ఆత్మహత్య చేసుకున్నాడు. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో గురువారం ఉదయం గుర్తు తెలియని యువకుని మృతదేహం లభ్యమైంది. కాళ్లకు చెప్పులు, ఒంటిపై దుస్తులు లేకుండా ఉన్న యువకుడి మృతదేహం గురించి తిమ్మాపురం పోలీసులు సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం చేశారు. బుధవారం రాత్రి నుంచి ఇంటికి రాని తమ బిడ్డ కోసం వాకబు చేస్తున్న కుటుంబ సభ్యులు వాట్సాప్ గ్రూపులోని ఫొటోను చూసి తిమ్మాపురం పోలీసులను ఆశ్రయించారు. కాకినాడ శాంతినగర్‌లో ఇంటర్మీడియెట్ బైపీసీ చదివిన వెంకట సుబ్రహ్మణ్యం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసి ఎంసెట్ ఎంట్రన్స్ కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. బుధవారం సాయంత్రం 6గంటల తరువాత వెలువడిన ఫలితాలల్లో నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయినట్టు తెలుసుకుని ఇంటికి వెళ్లలేదు. రాత్రి ఇంటికి రాని కుమారుడు గురించి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కంగారు పడి ఇరుగు పొరుగు, స్నేహితులు వద్ద వాకబు చేశారు. సూర్యారావుపేట బీచ్‌లో లభ్యమైన మృతదేహం తమ కుమారుడిదని తెలుసుకుని తల్లడిల్లారు. మృతుడి కుటుంబం ఐ.పోలవరం మండలం బైరవపాలెం నుంచి సుమారు 20 ఏళ్ల క్రితం వచ్చి జగన్నాథపురంలోని చిక్కాలవారి వీధిలో స్థిరపడింది. అగ్నికుల క్షత్రియులైన వీరికి చేపల వేట ప్రధాన వృత్తి. అయితే మృతుడి తండ్రి వెంకటరత్నం రొయ్యల ఫ్యాక్టరీలో కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి సత్యవేణి గృహిణి. వీరికి ముగ్గురు సంతానం కాగా వీరిలో పెద్ద కుమార్తె డిగ్రీ చదువుతుండగా చిన్న కుమార్తె 9వ తరగతి చదువుతోంది. ఏకైక కుమారుడు వెంకట సుబ్రహ్మణ్యం అకాల మృతితో తల్లిదండ్రులు, తోబుట్టువులు, కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాగార్జునరాజు తెలిపారు.

మోటార్ సైకిలిస్ట్ దుర్మరణం


రాజేంద్రప్రసాద్ మృతదేహం

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం జరిగింది. ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి మండలం పూచికపాడు గ్రామానికి చెందిన చందమాల రాజేంద్రప్రసాద్ (48) తన బంధువును రాజమహేంద్రవరం తీసుకెళ్లి రైలు ఎక్కించి మోటార్ సైకిల్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. జగన్నాథపురం వచ్చే సరికి జంగారెడ్డిగూడెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ వేగంగా మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో రాజేంద్రప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి రాజేంద్రన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

డ్రైనేజీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పిఠాపురం: స్థానిక రథాలపేట సెంటర్లో మురికి కాలువలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు పట్టణ ఎస్సై జగన్మోహన్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు సేకరిస్తున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.7.70 లక్షల సొత్తు స్వాధీనం
- 40కి పైగా కేసుల్లో నిందితులు
- పోలీసులను అభినందించిన ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను ప్రకాశం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.7 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ మలికా గర్గ్ వివరాలను వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో నగరంలోని భాగ్యనగర్ 3వ లైనులో బాలిన శ్రీమన్నారాయణ కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు 5 కేజీల వెండి వస్తువులు, 64 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు, ఫోను దొంగలించారు. నవంబర్‌లో రాజీవ్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పర్వతం అనుపల్లవి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బంగారు ఆభరణాలు, రెండు ల్యాప్‌టాప్‌లను చోరీ చేశారు. అదే నెలలో బాపట్ల నగరంలోని ఎస్ఎన్‌వీ అగ్రహారంలో సోమరౌతు వెంకట తులసి ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించిన దొంగలు వెండి వస్తువులను దోచుకుని వెళ్లారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో వరుస చోరీలు జరుగుతుండడంతో సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ మలికాగర్గ్ ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో ఒక టీంను నియమించారు. తమదైన శైలిలో దర్యాప్తు చేసిన ప్రత్యేక టీం రాజమహేంద్రవరానికి చెందిన చొల్లంగి సురేష్, గుంటూరుకు చెందిన మర్రి రవికుమార్, కువ్వారపు అజయ్‌లతో కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సమాచారాన్ని సేకరించారు. గురువారం ఉదయం ఒంగోలు గాంధీరోడ్డులో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. చొల్లంగి సురేష్‌పై 26 కేసులు ఉండగా, రవికుమార్ 15 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. వీరు ఒక ముఠాగా ఏర్పడి వైజాగ్, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్, మంగళగిరి ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరి వద్ద నుంచి వెండి, బంగారం, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సొత్తు విలువ రూ.7.70 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులను ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ (క్రైమ్) శ్రీధర్‌బాబు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు పాల్గొన్నారు.


చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

డ్వామా అధికారులకు ముగిసిన శిక్షణ


సర్టిఫికెట్లు అందజేస్తున్న కృష్ణమోహన్

సామర్లకోట: మూడురోజుల పాటు పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అధికారులకు సూచించారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో పని చేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓ, ఏసీ, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. డ్వామాలో రూపొందించిన కొత్త సాఫ్ట్‌వేర్, పనుల్లో నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, చేయవలసిన పనులపై శిక్షణ నిర్వహించారు. మూడు రోజుల ఈ శిక్షణకు 119 మంది హాజరయ్యారు. ఇప్పటి వరకు ఈటీసీలో నిర్వహించిన ఏడు బ్యాచ్‌ల శిక్షణలో 9 జిల్లాల నుంచి 346 మంది పాల్గొన్నారని కృష్ణమోహన్ చెప్పారు. రీసోర్సు పర్సన్లు బి.శ్వేత, సునీల్, జీటీఎన్ సాగర్, వి.సురేష్‌కుమార్, ఎం.సత్యనారాయణ, ఎస్.నరేష్‌బాబు, ఎస్.శ్యామల శిక్షణ నిర్వహించగా, కోఆర్డినేటర్లు జి.శ్రీహరి, జి.రమేష్ పర్యవేక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కృష్ణమోహన్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఘనంగా మారేడు వన మహోత్సవం

అన్నవరం: అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పూజలకు ఉపయోగించే మారేడు పత్రి కోసం ‘మారేడు వన మహోత్సవం’ పేరుతో దేవస్థానం భూముల్లో మారేడు చెట్లు పెంచే కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. స్థానిక జాతీయ రహదారి పక్కనే దేవస్థానానికి గల 4.25 ఎకరాల భూమిలో 322 మారేడు మొక్కలను నాటారు. దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ దంపతులు తొలుత మారేడు మొక్కలకు పూజలు చేశారు. అనంతరం వారితో బాటు పెద్ద సంఖ్యలో దేవస్థానం సిబ్బంది, పురోహితులు, అర్చకులు, వ్రత పురోహితులు తలో ఒక మొక్క నాటారు. కార్తిక మాసం నాటికి ఈ మొక్కలు బాగా పెరిగేలా నిరంతరం నీటి సరఫరా జరిగేలా సోలార్‌తో పనిచేసే బోర్ వెల్స్ ఏర్పాటు చేశారు. మారేడుతో బాటు 108 జమ్మి, మూడు వేల తులసి, 150 అరటి, ఐదు ఉసిరి మొక్కలను నాటారు.

మారేడు కొరతను అధిగమించేలా...

మారేడు పత్రిని ఇన్నాళ్లు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అటవీ ప్రాంతాలకు వెళ్లి తీసుకువస్తున్నారు. వేసవి కాలంలో అక్కడ చెట్లు ఎండిపోవడంతో పత్రి లభ్యం కాదు. ఈ పరిస్థితుల్లో జమ్మి పత్రిని తీసుకువచ్చి స్వామివారి వ్రతాలలో ఉపయోగిస్తుంటారు. ఇప్పుడు నాటిన మారేడు మొక్కలు పెద్దవైతే దేవస్థానానికి అన్ని కాలాల్లోను మారేడు దళాలు లభ్యమవుతాయని భావిస్తున్నారు.

సత్యదేవుని తలంబ్రాల పంపిణీకి చర్యలు

మే నెల ఒకటో తేదీన జరగనున్న సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్ల తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్షింతల పంపిణీకి నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశామని, కల్యాణం అనంతరం అక్షింతలను మేళతాళాల మధ్య అక్కడకు తీసుకువెళ్లి భక్తులకు పంపిణీ చేస్తామన్నారు. వంద కేజీల ధాన్యం మహిళలతో గోటితో ఒలిపించగా వచ్చిన బియ్యానికి పది కిలోల ముత్యాలు కలిపి తలంబ్రాలుగా కల్యాణంలో ఉపయోగించనున్నట్లు తెలిపారు. ఆ తలంబ్రాలనే భక్తులకు పంపిణీ చేస్తారని తెలిపారు. 30 వ తేదీన స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసే కార్యక్రమం మొదలుకుని మే ఒకటో తేదీన సత్యదేవుని దివ్యకల్యాణం, రెండో తేదీ అరుంధతి దర్శనం, మూడో తేదీన వేదపండిత సదస్యం, నాలుగో తేదీన వనవిహారం, ఐదో తేదీన చక్రస్నానం, ఆరో తేదీన శ్రీపుష్పయాగం కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల ఏర్పాట్లపై ఇప్పటికే జిల్లా ఎస్పీ, ఇతర అధికారులతో చర్చించామని వివరించారు. దేవస్థానంలో, కొండదిగువన విద్యుత్ అలంకరణ చాలా వరకు పూర్తయిందని తెలిపారు.


మారేడు మొక్క నాటుతున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు